క్లుప్తంగా

17న మహిళా జాబ్ మేళా

కల్వకుర్తి రూరల్: మహిళలకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ఈ నెల 17న కల్వకుర్తి ఐక్యత కార్యాలయంలో జాబ్ మేళా మహిళల కోసం ఏర్పాటు చేసినట్లు ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి శనివారం తెలిపారు. పదో తరగతి, ఇంటర్, డిగ్రీ, డిప్లొమా, నర్సింగ్, ఏ కోర్సు చదివిన మహిళలైనా 18 నుంచి 30 ఏళ్ల మధ్య వయసున్నవారు, కల్వకుర్తి పట్టణానికి ఐదు కిలోమీటర్ల లోపు ఉన్న వారు జాబ్ మేళాకు హాజరుకావాలని సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి కోరారు.

కొల్లాపూర్ డిగ్రీ కళాశాలలో..

కొల్లాపూర్: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 17న జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ సి.రమేష్‌కుమార్ తెలిపారు. ఫాక్స్‌కాన్ కంపెనీలో పనిచేసేందుకు ఉద్యోగుల ఎంపిక నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఎస్‌ఎస్‌సీ, ఇంటర్, డిగ్రీ, ఐటీఐ, పాలిటెక్నిక్ వారు జాబ్‌మేళాలో పాల్గొనవచ్చని తెలిపారు. 18 నుంచి 30 ఏళ్ల వయస్సు గల వారు తమ విద్యార్హతల ధ్రువీకరణ పత్రాలతో పాటు వారి రెజ్యూమ్‌తో జాబ్‌మేళాకు హాజరుకావాలని సూచించారు. పూర్తి వివరాలకు 9290086457, 8519991419కు ఫోన్ చేయాలని సూచించారు.

ముగిసిన బ్రహ్మోత్సవాలు



పెద్దకొత్తపల్లి: దేవల్‌తిర్మలాపూర్‌లోని శ్రీభూనీల వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు చక్రస్నానంతో ముగిసినట్లు ఆలయ పూజారి శేషాచార్యులు తెలిపారు. బ్రహ్మోత్సవాలు ఈ నెల 6న ప్రారంభమై చక్రస్నానంతో ముగిశాయి. నెల రోజుల పాటు జాతర కొనసాగుతుందని ఆయన అన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

పాఠశాలలో ఎంఈఓ తనిఖీ

లింగాల: మండలంలోని అంబట్‌పల్లి జిల్లా పరిషత్ ఉన్నత, ప్రాథమిక పాఠశాలలను శనివారం మండల విద్యాధికారి బషీర్ అహ్మద్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల్లో ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు రిజిస్టర్లను, మధ్యాహ్న భోజనం పరిశీలించారు. అడ్మిషన్ పొంది బడికి రాని 19 మంది విద్యార్థులను తిరిగి బడికి రప్పించారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సగరుల సత్తా చాటుదాం

కల్వకుర్తి రూరల్: సగర శంఖారావానికి జిల్లాలోని సగరులు పెద్ద ఎత్తున తరలివచ్చి సగరుల సత్తా చాటాలని సగర సంఘం జిల్లా కోశాధికారి పడకంటి రాజు సాగర్ కోరారు. శనివారం సాయంత్రం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆదివారం నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో నిర్వహించే సగర శంఖారావానికి అధిక సంఖ్యలో రావాలని కోరారు.

శివస్వాములకు అన్నదానం



కందనూలు: నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని ఓంనగర్ కాలనీలో శనివారం శివస్వాములకు సేవా సమితి అధ్యక్షురాలు కొత్త రేవతి కమిటీ సభ్యులతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వివిధ ప్రాంతాల నుంచి కాలినడకన వచ్చిన స్వాములు 300 మందికి అన్నప్రసాదం, పండ్లు పంపిణీ చేశారు. ఈ నెల 25వ తేదీ వరకు శివస్వాములకు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు రాధారాణి, పద్మ, సరిత, అనసూయమ్మ, శివస్వాములు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాలపై అవగాహన

కొల్లాపూర్: మండలంలోని నార్లాపూర్‌లో ఫారెస్టు అధికారులు శివస్వాములను కలిసి, వారికి అడవుల్లో అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. అగ్నిప్రమాదాలను నివారిద్దామని శివస్వాములతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఫారెస్టు రేంజర్ చంద్రశేఖర్‌తో పాటు సెక్షన్ ఆఫీసర్లు, బీట్ ఆఫీసర్లు ఉన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

లింగాల: మండలంలోని అంబట్‌పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు సూర్యతేజ, ప్రసన్న లక్ష్మి, రమణయ్య, రామకృష్ణ విద్యార్థులకు హిమోగ్లోబిన్ వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం నిరంజన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఖురాన్ పఠనం



వెల్దండ: మండల కేంద్రంలోని శ్రీ సయ్యద్ ఖాజా జిందా(షా)వలి ఉత్సవాల్లో భాగంగా శనివారం ఖురాన్ పఠనం నిర్వహించారు. అనంతరం ప్రార్థన చేశారు. కార్యక్రమంలో దర్గా ముజావర్ కమిటీ సభ్యులు శంషోద్దీన్, ఇలియాస్, ఫరీద్, సాదిక్, అల్లాజీ, మేరాజ్, వల్లియోద్దీన్, ఇంతియాజ్, బురాన్, అల్లాజీ ఉన్నారు.



కొండనాగుల గిరిజన వసతి గృహంలో ..



వెల్దండలో పాల్గొన్న గిరిజన సంఘం నాయకులు



ఈగలపెంటలో సీఈ, ఎస్‌ఈ, ఇంజినీర్లు

ఘనంగా సంత్ సేవాలాల్ జయంతి

- దారారంలో విగ్రహావిష్కరణ
- చిత్రపటానికి పూలమాలలు వేసిన నేతలు
- వేడుకల్లో పాల్గొన్న బంజారాలు



దారారంలో సేవాలాల్ మహారాజ్ విగ్రహ విష్కరణలో పాల్గొన్న బంజారా నాయకులు, మహిళలు

సాక్షి, నెట్‌వర్క్: గిరిజనుల ఆరాధ్య దైవం శ్రీసంత్ సేవాలాల్ మహారాజ్ 286వ జయంతిని కల్వకుర్తిలో ఘనంగా జరుపుకున్నారు. బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో చిత్రపటానికి పూలమాలలు వేసి వేడుకలు నిర్వహించారు.

- లింగాల మండల కేంద్రంలోని దారారంలో శ్రీనివాస్‌రాథోడ్ ఆధ్వర్యంలో సేవాలాల్ మహారాజ్ విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం ఘనంగా నిర్వహించారు.
- అచ్చంపేట పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలో సేవాలాల్ జయంతి నిర్వహించారు.
- వెల్దండ మండల కేంద్రం, గిరిజన తండాల్లో సంత్ సేవాలాల్ చిత్రపటానికి పూలమాలలు వేసి జయంతి నిర్వహించారు.
- ఈగలపెంట జెన్‌కో ఉద్యోగుల నివాస కాలనీలో గిరిజన విద్యుత్ ఉద్యోగులు సేవాలాల్ జయంతి ఘనంగా నిర్వహించారు.
- బల్మూర్ మండలంలోని కొండనాగుల గిరిజన బాలుర వసతి గృహంలో సంత్ సేవాలాల్ జయంతి ఘనంగా నిర్వహించారు.
- తిమ్మాజిపేటతో పాటు మండలంలోని లక్ష్మణ్ నాయక్ తండాలో గిరిజనులు సేవాలాల్ చిత్రపటానికి పూలమాలలు వేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. తిమ్మాజిపేటలో గిరిజనులు భారీ ఊరేగింపు నిర్వహించారు.
- కొల్లాపూర్ ప్రభుత్వ పీజీ కళాశాలలో సంత్‌సేవాలాల్ చిత్రపటానికి కళాశాల ప్రిన్సిపాల్ మార్క్ పోలోనియస్ పూలమాలలు వేశారు. భోగ్ వేడుకల్లో విద్యార్థులు పాల్గొన్నారు.



కొల్లాపూర్ పీజీ కళాశాలలో సేవాలాల్ జయంతి వేడుకలు



కల్వకుర్తిలో సేవాలాల్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న ఎడ్మ సత్యం

ప్రజలకు అందుబాటులో ఉండాలి



మాట్లాడుతున్న డీఎల్‌పీఓ నర్సిరెడ్డి

వెల్దండ: గ్రామాల్లో కార్యదర్శులు ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందించాలని కల్వకుర్తి డివిజన్ డీఎల్‌పీఓ నర్సిరెడ్డి పేర్కొన్నారు. శనివారం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో కార్యదర్శులకు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎల్‌పీఓ నర్సిరెడ్డి మాట్లాడుతూ వేసవి సమీపిస్తుండడంతో ప్రజలకు తాగునీరు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామ పంచాయతీల్లో రికార్డులను సక్రమంగా ఉంచుకోవాలన్నారు. వెంచర్లకు ఎల్‌ఆర్‌ఎస్ సక్రమంగా చేయాలన్నారు. గ్రామాల్లోని నర్సరీలల్లో పెంచుతున్న మొక్కలకు సకాలంలో నీరు అందించి ఎండకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. విధులపట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం సలహాలు, సూచనలు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సత్యపాల్‌రెడ్డి, ఎంపీఓ లక్ష్మణ్, ఇన్‌చార్జి సూపరింటెండెంట్ రేవంత్‌రెడ్డి, సిబ్బంది, ఆయా గ్రామాల కార్యదర్శులున్నారు.

అర్హులైన లబ్ధిదారులకే ఇందిరమ్మ ఇళ్లు



వెల్దండ: మండలంలోని చెర్కూర్‌లో శనివారం ఎంపీడీఓ సత్యపాల్‌రెడ్డి ఇంటింట ఇందిరమ్మ ఇళ్ల సర్వే నిర్వహించారు. ప్రభుత్వం ఇటీవల మండలానికి ఒక గ్రామం చెర్కూర్‌ను కలెక్టర్ ఆదేశాలతో ఎంపిక చేశారు. గ్రామంలో రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల దరఖాస్తులను పరిశీలించారు. ఎంపీడీఓ సత్యపాల్‌రెడ్డి గ్రామంలో 98మంది ఇందిరమ్మ ఇళ్లకు దరఖాస్తులు చేసుకున్నట్లు పేర్కొన్నారు. నిజమైన లబ్ధిదారులను ఎంపిక చేస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శి హరిణి, సిబ్బంది తదితరులు ఉన్నారు.

ప్రధానోపాధ్యాయుడిపై చర్యలు తీసుకోవాలి

అచ్చంపేట రూరల్: తోటి మహిళా ఉపాధ్యాయులను వేధించిన ప్రధానోపాధ్యాయుడు జీవన్‌కుమార్‌ను వెంటనే సస్పెండ్ చేయాలని బీజేపీ పట్టణ అధ్యక్షుడు గండు శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయం ఎదుట బీజేపీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. అనంతరం కార్యాలయంలోని డిప్యూటీ తహసీల్దార్ కేశవులుకు వినతిపత్రం అందజేశారు. పట్టణంలోని సాయినగర్ జెడ్పీహెచ్‌ఎస్‌లో విధులు నిర్వహిస్తున్న ప్రధానోపాధ్యాయుడు జీవన్‌కుమార్ ప్రస్తుతం అచ్చంపేట మండల ఇన్‌చార్జి ఎంఈఓగా బాధ్యతలు నిర్వహిస్తున్నాడు. ఆ పాఠశాలలోని మహిళా ఉపాధ్యాయులను మానసికంగా వేధిస్తున్నాడని ఆరోపించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు శ్రీనునాయక్, చందులాల్, శివచంద్ర, అమర్, దేవేందర్ పాల్గొన్నారు.

క్రిమినల్ కేసు నమోదు చేయాలి

తోటి మహిళా ఉపాధ్యాయులపై అసభ్యంగా ప్రవర్తించిన ఇన్‌చార్జి ఎంఈఓ జీవన్‌కుమార్‌పై క్రిమినల్ కేసు నమోదు చేయాలని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి ప్రేమ్‌కుమార్ డిమాండ్ చేశారు. ఆరు నెలలుగా మహిళా ఉపాధ్యాయులను వేధిస్తున్నాడని ఆరోపించారు. వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పోలింగ్ కేంద్రాల జాబితా విడుదల



చారకొండ: మండలంలోని 6 ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాలకు సంబంధించి పోలింగ్ కేంద్రాల జాబితాను శనివారం మండల కేంద్రంలో ఎంపీడీఓ ఇసాక్ హుస్సేన్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో 41 పోలింగ్ కేంద్రాలను గుర్తించినట్లు తెలిపారు. ఒక్కొక్క పోలింగ్ కేంద్రంలో 515 ఓటర్లు ఉంటారని, మండలంలో మొత్తం 21,151 మంది ఓటర్లు ఉన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీఓ వెంకటేష్, పంచాయతీ కార్యదర్శి, గణేష్, సిబ్బంది ఉన్నారు.

ఐదోరోజూ బైపాస్ బాధితుల రిలే దీక్షలు



రిలే దీక్షలో మాట్లాడుతున్న పరశురాములు

చారకొండ: చారకొండలో జాతీయ రహదారి 167 బైపాస్ నిర్మాణంలో అడ్డుగా ఉన్న ఇళ్లను అధికారులు తొలగించారు. దీంతో వారు నిరాశ్రయులయ్యారని, బాధితులకు న్యాయం చేయాలని కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి పులిజాల పరశురాములు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో బైపాస్ బాధితులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు ఐదో రోజుకు చేరాయి. బాధితులకు మద్దతు తెలిపి ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి బాలస్వామి, సీపీఐ ఇన్‌చార్జి చిల్వేరు శ్రీను, సీపీఐ మండల కార్యదర్శి అశోక్, బాధితులు కిరణ్, అనిల్, విజయ, అలివేలు, శిరీష, అశోక్‌రెడ్డి, చిట్టెమ్మ, లాలమ్మ, గుండె బాలనారి వెంకటమ్మ, సుమతమ్మ, కవిత, విష్ణు, సైదమ్మ ఉన్నారు.

క్షయవ్యాధిపై అప్రమత్తంగా ఉండాలి

చారకొండ: క్షయవ్యాధిపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మండల వైద్యాధికారి మంజుభార్గవి అన్నారు. మండల కేంద్రంలో క్షయవ్యాధి నిర్మూలనకు మండల కేంద్రంలో క్షయవ్యాధి శిబిరం ఏర్పాటు చేశారు. శిబిరంలో 170 మంది క్షయ వ్యాధి పరీక్షలు చేసుకున్నారు. శిబిరాన్ని తహసీల్దార్ సునిత సందర్శించారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ జగన్‌లాల్, సీహెచ్‌ఓ శేఖర్ రెడ్డి, హెచ్‌ఈఓలు హస్తరుక్, చారి, ఎన్‌ఎంలు, ఆశలు ఉన్నారు.

భౌరాపురం జాతరకు వసతులు కల్పించాలి



లింగాలలో మాట్లాడుతున్న గురువయ్య

లింగాల: మండలంలోని నల్లమల అటవీ ప్రాంతంలో ఉన్న భౌరాపురంలో మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా నిర్వహించే చెంచుల జాతరకు పూర్తి స్థాయిలో వసతులు కల్పించి భక్తులకు ఇబ్బందులు కలుగకుండా చూడాలని చెంచు నాయకుడు తోకల గురువయ్య ప్రభుత్వాన్ని కోరారు. శనివారం మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం అధికారికంగా చెంచుల జాతరను నిర్వహిస్తోందని, అందుకు తగ్గట్టుగా ఏర్పాట్లు చేయడం లేదని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. భౌరాపురం భ్రమరాంభ, మల్లికార్జున పురాతన ఆలయాన్ని జాతర సమయంలోనే రెండు మూడు రోజులు ముస్తాబు చేసి, ఆ తర్వాత పట్టించుకోవడం లేదని ఆయన విమర్శించారు. ఇప్పటికైనా కలెక్టర్, ఇతర ఉన్నతాధికారులు స్పందించి పుణ్యక్షేత్రానికి వెళ్లేందుకు సరైన రోడ్డు మార్గం కల్పించాలని, దేవాలయం ఆవరణలో శాశ్వత పనులను చేయించాలని ఆయన కోరారు. సమావేశంలో మహేష్, కుర్మయ్య, బాలాజీ నాయక్ పాల్గొన్నారు.

ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం



నాగర్‌కర్నూల్‌రూరల్: ఆటో కార్మికులకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రకటించిన రూ. 12 వేల జీవనభృతిని వెంటనే చెల్లించాలని, సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కురుమూర్తి, పాదిల రామయ్య మాట్లాడారు. కార్యక్రమంలో టౌన్ అధ్యక్షులు సంద సుధాకర్, వెంకటస్వామి, రాజు, సైదులు ఉన్నారు.

జర్నలిస్టులపై అక్రమ కేసులు ఎత్తివేయాలి

నాగర్‌కర్నూల్: జర్నలిస్టులపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలని శనివారం నాగర్ కర్నూల్ డీఎస్పీ శ్రీనివాస్‌కు ప్రింట్ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు వినతిపత్రం అందించారు. తెలకపల్లి మహాత్మా జ్యోతిరావు పూలే బీసీ గురుకుల బాలికల పాఠశాలలో ఈనెల 12న తెలకపల్లిలోని దివ్య క్లినిక్ ప్రైవేట్ ఆస్పత్రిలో అస్వస్థతకు గురైన విద్యార్థినులు చికిత్స పొందుతున్న వార్తను ప్రచురించారని ప్రిన్సిపాల్ ఏ.రశ్మి ఫిర్యాదు చేసిందన్నారు. ఈ మేరకు తెలకపల్లి పోలీసులు పెట్టిన అక్రమ కేసును ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టు వార్తలు ప్రచురించిన, ప్రసారం చేసిన ఖండన ఇవ్వకుండా పోలీసులకు ఫిర్యాదు చేసి కేసులు నమోదు చేయించడాన్ని జర్నలిస్టులు తీవ్రంగా ఖండించారు. పూర్తి స్థాయిలో విచారణ చేసి ఈ కేసుతో సంబంధం లేని వారి విషయం పరిశీలిస్తామని డీఎస్పీ హామీ ఇచ్చారు. ఆర్డీఓ కార్యాలయం నుంచి జర్నలిస్టులు నల్ల బ్యాడ్జీలతో పోలీస్‌స్టేషన్ వరకు ర్యాలీ చేశారు.

చెంచు గిరిజనులందరికీ రేషన్ కార్డులు



మాట్లాడుతున్న ఆర్డీఓ మాధవి

అమ్రాబాద్: అచ్చంపేట నియోజకవర్గంలో నివసిస్తున్న అర్హులైన ఆదిమజాతి చెంచు గిరిజనులందరికీ రేషన్‌కార్డులు అందిస్తామని అచ్చంపేట ఆర్డీఓ మాధవి తెలిపారు. శనివారం ఉమ్మడి అమ్రాబాద్ మండలంలోని వివిధ చెంచుపెంటల్లో ఆర్డీఓ పర్యటించి రేషన్ కార్డులు లేని చెంచుల వివరాలను సేకరించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ కార్యాలయంలో ఆర్డీఓ విలేకర్లతో మాట్లాడారు. నల్లమల ప్రాంతంలో అచ్చంపేట నియోజకవర్గంలోని ఆయా మండలాల్లో ఉన్న 71 చెంచు పెంటల్లో నివసిస్తున్న 844 మంది చెంచులకు అందడం లేదని, వారికి తక్షణమే రేషన్ కార్డులు అందిస్తామని తెలిపారు. తహసీల్దార్ శైలేంద్ర కుమార్, డిప్యూటీ తహసీల్దార్ రాహుఫ్ ఉన్నారు.

ముగ్గురు ఫీల్డ్ అసిస్టెంట్లకు షోకాజ్ నోటీసులు



మాట్లాడుతున్న చిన్న ఓబులేసు

కల్వకుర్తి రూరల్: ఉపాధి హామీ పథకం పనుల్లో పురోగతి సరిగ్గా లేని ముగ్గురు ఫీల్డ్ అసిస్టెంట్లకు జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ అధికారి చిన్న ఓబులేసు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. శనివారం చారకొండ మండలానికి చెందిన ఫీల్డ్ అసిస్టెంట్ సత్యనారాయణ, వెల్దండ మండలానికి చెందిన ఫీల్డ్ అసిస్టెంట్లు ఎల్లయ్య, యాదయ్యలకు నోటీసులు జారీ చేశారు. పట్టణంలోని ఉపాధి హామీ కార్యాలయంలో కల్వకుర్తి క్లస్టర్‌లోని వంగూరు, చారకొండ, వెల్దండ, కల్వకుర్తి, ఊరుకొండ మండలాల పరిధిలో పనిచేస్తున్న ఉపాధి హామీ సిబ్బంది, ఏపీఓలు, ఈసీలు, టెక్నికల్ అసిస్టెంట్స్, ఫీల్డ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఇప్పటివరకు చేపట్టిన ఉపాధి హామీ పనుల పై సమగ్రంగా చర్చించారు. పనితీరు సరిగా లేని వారిపై కఠిన చర్యలు తీసుకోవడం తప్పదని జిల్లా అధికారి చిన్న ఓబులేసు చెప్పారు. కార్యక్రమంలో కల్వకుర్తి అసిస్టెంట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ చంద్రశేఖర్, ఏపీఓలు శివశంకర్ గౌడ్, నరసింహ, లక్ష్మయ్య, రాజు ఈసీలు దేవేందర్ గౌడ్, కిషన్, చందన పాల్గొన్నారు.

పురాతన ఆలయం సందర్శించిన డిగ్రీ విద్యార్థులు



వర్ధమానపురంలో కాకతీయుల కాలం నాటి ఆలయాన్ని సందర్శించిన విద్యార్థులు

కందనూలు: నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని శ్రీపురం రోడ్డులోని ప్రభుత్వ డిగ్రీ, పీజీ ఆర్ట్స్ కళాశాల విద్యార్థులు శనివారం క్షేత్ర పర్యటనలో భాగంగా నందివడ్డేమాన్ (వర్ధమానపురం)ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయ పూజారి విద్యార్థులకు పురాతన కాలంనాటి కాకతీయ రుద్రదేవుడు కందూరు చోళులను పాలదోలడంతో వారు వర్ధమానపురంలో స్థిరపడినట్లు తెలిపారు. వారి ఆస్థానంలో గోనబుద్దారెడ్డిని తన సామంతుడిగా నియమించారని, ఇతని కుమారుడు గోన గన్నారెడ్డి వర్ధమానపురాన్ని రాజధానిగా చేసుకొని పరిపాలించారని, కాకతీయ సామ్రాజ్యం కాలంలో వర్ధమానపురం వ్యాపారం మహాచురుకుగా సాగేదని, కాకతీయుల కాలంనాటి శివుని వాహనమైన నంది ఉండటం వల్ల ఈ ప్రాంతానికి నందివడ్డేమాన్ అనే పేరు వచ్చిందన్నారు. తెలంగాణలో ఇలాంటి ప్రాముఖ్యతగల శనేశ్వర విగ్రహం ఎక్కడా లేదని విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వై.కృష్ణయ్య, వైస్ ప్రిన్సిపాల్ ధర్మ, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రైతు పక్షపాతి సీఎం రేవంత్‌రెడ్డి

చారకొండ: రైతు పక్షపాతి సీఎం రేవంత్‌రెడ్డి అని, రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం కృషి చేస్తోందని సింగిల్ విండో చైర్మన్ గుర్వయ్య గౌడ్ అన్నారు. మండల కేంద్రంలో శనివారం సింగిల్ విండో కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఆరు నెలల పాటు పదవీ కాలం పొడగించడంతో హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డైరెక్టర్లు కొండలయ్య, జగన్మోహన్, తదితరులు ఉన్నారు.

సీఎం చిత్రపటాల దహనం

అచ్చంపేట రూరల్: ప్రధాని నరేంద్రమోదీపై సీఎం రేవంత్‌రెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేయడం సరైంది కాదని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మంగ్యానాయక్ అన్నారు. శనివారం పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు గండు శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటాలను దహనం చేశారు. కార్యక్రమంలో నాగరాజు, శ్రీనివాస్‌గౌడ్, శ్రీనునాయక్, జానకి, రేణయ్య, పత్యానాయక్, రవీందర్, రాములు, చందులాల్ చౌహాన్, శివచంద్ర, అమర్, మహేశ్వరి పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో పూజలు



కల్వకుర్తి రూరల్: మండలంలోని మార్చాల ప్రసన్న ఆంజనేయస్వామి దేవాలయంలో సీతారాముల విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు శనివారం ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటు పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆలయం నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో గ్రామస్తులు, భక్తులు హాజరయ్యారు.

మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలి

అమ్రాబాద్: మహిళలు సమాఖ్య ద్వారా తీసుకున్న రుణాలతో ఆర్థిక స్వావలంబన సాధించాలని ఐకేపీ ఏపీఎం నిరంజన్ సూచించారు. శనివారం మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో సంఘాల సభ్యులకు స్వీయ పరిశుభ్రత, పౌష్టికాహారం, ఆరోగ్యం తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. సమావేశంలో ఏపీఎం నిరంజన్, సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

జ్యోతిరావుపూలే పాఠశాలను తాడూరుకు తరలించాలి

తాడూరు: మండల కేంద్రంలో నిర్వహించాల్సిన మహాత్మాజ్యోతిరావు పూలే బాలికల పాఠశాలకు తెలకపల్లిలో నిర్వహిస్తున్నారని, అధికారులు, ప్రజా ప్రతినిధులు ప్రత్యేక చొరవ కనబరిచి తాండూరు మండల కేంద్రానికి తరలించాలని ఏఐటీయూసీ ఆధ్వర్యంలో తహసీల్దార్ కిరణ్మయి వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వంలో తెలంగాణ వ్యాప్తంగా 119 నియోజకవర్గాలకు మహాత్మాజ్యోతిరావుపూలే పాఠశాల హాస్టళ్లను మజూరు చేసిందన్నారు. మండల కేంద్రంలో కొమ్ముకుంట దగ్గర ప్రభుత్వ భూమిలో నిర్మించాలని కోరారు.

గర్భిణులు పరీక్షలు చేయించుకోవాలి

నాగర్‌కర్నూల్ క్రైం: గర్భిణులు క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని మెడికల్ ఆఫీసర్ డా.మానస అన్నారు. శనివారం జిల్లా ఆస్పత్రి పీపీ యూనిట్ విభాగంలో వ్యాక్సినేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు ఎలాంటి ఆందోళనకు గురికావాల్సిన అవసరం లేదని, ప్రభుత్వం అందించే ఆరోగ్య సదుపాయాలను సమర్థంగా వినియోగించుకోవాలని సూచించారు. ప్రతి బుధ, శనివారం జిల్లా ఆస్పత్రి పీపీ యూనిట్ విభాగంలో వ్యాక్సినేషన్ ఉంటుందని తెలిపారు.

ఎంబ్రాయిడరీ శిక్షణ కేంద్రం ప్రారంభం



లింగాల: మాతృభూమి సంస్థ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో శనివారం మహిళలకు ఎంబ్రాయిడరీ శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాతృభూమి సంస్థ అధ్యక్షులు రమాకాంత్ మాట్లాడారు. మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందడం, స్వయం ఉపాధి అవకాశాలు మెరుగు పర్చుకునేందుకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 45 రోజుల పాటు శిక్షణ ఉంటుందని, ఆసక్తి గల మహిళలు, యువతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ట్రైనర్ అనిత, సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి



తాడూరు: ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు చదువుకే పరిమితం కాకుండా వివిధ రకాల పోటీల్లో రాణించాలని ఎంఈఓ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని ఐతోలు ఉన్నత పాఠశాలలో మండల స్థాయి తెలుగు ప్రతిభ పరీక్ష పోటీలను నిర్వహించారు. పోటీలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతుల ప్రదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం భాస్కర్ రెడ్డి, ఉపాధ్యాయులు జానయ్య, రమేష్ కుమార్, చాంద్‌పాషా, జ్యోజి రెడ్డి, బ్రహ్మయ్య, శైలజ, తదితరులు పాల్గొన్నారు.

ఇష్టంతో చదవాలి



తెలకపల్లి: విద్యార్థులు ఇష్టంతో చదవాలని, ఉన్నత స్థాయికి ఎదగాలని ప్రొఫెసర్ జగన్ అనారు. శనివారం మండలంలోని కారువంగ ఉన్నత పాఠశాల విద్యార్థులకు స్కూల్ బ్యాగులు, పరీక్ష ప్యాడ్‌లు, పెన్నులు, వస్తువులను, ల్యాబ్ ఇన్ఫర్‌మెటిక్ సాఫ్ట్‌వేర్ సంస్థ వ్యవస్థాపకులు రాజశేఖర్ అందజేశారు. ఈ సందర్భంగా 10వ తరగతి విద్యార్థులకు మోటివేషనల్ క్లాసులను నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు చెల్మారెడ్డి, ఉపాధ్యాయులు శ్రీకాంత్, మురళీధర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.